BHARATH SAMACHAR DIGITAL

23, ఆగస్టు 2026, ఆదివారం

భారత్ సమాచార్

అనాథలకు అండగా.. అంత్యక్రియలు



భారత్ సమాచార్, సంగారెడ్డి జిల్లా: మానవత్వమే సేవా ధ్యేయంగా పనిచేస్తున్న MDR ఫౌండేషన్ మరోసారి తన సేవా స్ఫూర్తిని చాటుకుంది. పటాన్‌చెరు పట్టణంలో ఒకే రోజు గుర్తుతెలియని ఇద్దరు మృతదేహాలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఫౌండేషన్ సభ్యులు బాధ్యత తీసుకుని అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

మహంకాళి దేవాలయం వద్ద అనారోగ్యంతో ఉన్న ఓ వ్యక్తిని గుర్తించిన స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యుల ఆచూకీ తెలియకపోవడంతో అంత్యక్రియల నిర్వహణకు ఎవరూ ముందుకు రాలేదు.

మరో ఘటనలో పటాన్‌చెరు బస్టాండ్ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందారు. ఈ ఘటనలోనూ మృతుడి కుటుంబ సభ్యులు అంత్యక్రియల కోసం ముందుకు రాకపోవడంతో మృతదేహం అనాథగా మారింది.

ఈ నేపథ్యంలో రెండు ఘటనలకు సంబంధించిన మృతదేహాల అంత్యక్రియలను MDR ఫౌండేషన్ సభ్యులు చేపట్టారు. ఎవరూ లేని వారికి తాము అండగా ఉంటామని, మృతులకు గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు నిర్వహించడం కూడా మానవతా సేవలో భాగమేనని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఫౌండేషన్ సేవా కార్యక్రమాలపై స్థానికులు అభినందనలు తెలిపారు.

© 2026 Bharath Samachar